# 108లో ఆదివాసీ గర్భిణీ ప్రసవం



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండలం దబోలి గ్రామానికి చెందిన ఆదివాసీ గర్భిణీ ఆత్రం అర్చనకు గురువారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఆమెను ఉట్నూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలోనే ప్రసవం జరిగింది. ఉట్నూర్ మండలం హస్నాపూర్ సమీపానికి చేరుకునేసరికి ఆమెకు నొప్పులు తీవ్రమవడంతో 108 అంబులెన్స్‌లోనే ఎమర్జెన్సీగా ప్రసూతి నిర్వహించినట్లు 108 ఈఎంటీ ప్రశాంత్ కుమార్, పైలెట్ అడా దయాకర్ తెలిపారు. సమయస్ఫూర్తితో వైద్య సేవలు అందించడంతో తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని, అనంతరం వారిని ఉట్నూర్ ఆసుపత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు. 108 అంబులెన్స్‌లో సురక్షితంగా ప్రసూతి జరగడంతో గర్భిణీ కుటుంబ సభ్యులు ఈఎంటీ, పైలెట్‌లకు కృతజ్ఞ తలు

# భక్తి శ్రద్ధ లతో రామాయణ పారాయణం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ఇచ్చోడ మండలం యాపాల్‌గూడ గ్రామంలో గురుదేవ్ నగర్ బాబేర సంస్థ పీఠాధిపతి శ్రీ ఆత్రం పురుషోత్తం మహారాజ్ చేతుల మీదుగా రామాయణ పారాయణం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా అధికార ప్రతినిధి కుంరం కోటేష్ పాల్గొని పారాయణాన్ని ఆలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణ పారాయణం ద్వారా వ్యక్తి జీవితంలో సత్ప్రవర్తన పెంపొందుతుందని అన్నారు. స్వామి వారి దీవెనలు మండల, జిల్లా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. సీతమ్మ తల్లి అనుభవించిన కష్టాలను గుర్తుచేసుకుంటూ నేటి తరం జీవన విధానాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడం గంగారాం పటేల్, గ్రామ పటేల్ నైతం సూర్యబాన్, దేవరి జుగ్నక్ అశోక్, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# స్వామి వారి సన్నిధిలో కాంగ్రెస్ నేతలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** శ్రీరామ నవమి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని పలు దేవాలయాలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దీపక్ రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శాంతన్ రావు, భూమా రెడ్డి, మల్లా రెడ్డి, అశోక్, సంతోష్ రెడ్డి, పుండ్రు రవికిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముని జీవితం అందరికీ ఆచరణీయం





- మంత్రి గడ్డం వివేకానంద

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** శ్రీరాముడు ఆచరించిన జీవితం మనందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మందమర్రి మండలం పాలచెట్టు ప్రాంతంలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సతీమణి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహశీల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు తదితరులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. శ్రీరాముడు నీతి, నిజాయితీతో జీవించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక మార్గం ద్వారా మనస్సు శాంతి లభిస్తుందని, అందరూ శ్రీరాముని ఆశయాలను అనుసరించాలని సూచించారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్లు, మురుగు కాలువల అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో సుమారు రూ.30 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి కొనసాగిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక మనిషి జీవన విధానాన్ని శ్రీరాముడు ఆచరించి చూపారని, నీతి, నిజాయితీ కలిగి ఉండాలని తెలిపారు. శ్రీరాముడి స్ఫూర్తితో జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి ప్రతిఒక్కరు తమవంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. అనంతరం మంత్రి జిల్లాలోని క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీ, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# వరుస చోరీలతో జంకుతున్న మండలవాసులు


- తాళం వేసిన ఇళ్లే టార్గెట్..
- భారీగా బంగారం, నగదు అపహరణ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలో వరుసగా జరుగుతున్న చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల చాంద్ పాషా ఇంట్లో చోరీ జరిగిన ఘటన మరువకముందే, శుక్రవారం జాదవ్ భీంరావు ఇంట్లో మరో భారీ చోరీ చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. పోలీసుల వివరాల ప్రకారం.. భీంరావు ఈనెల 26న తన కుమార్తెకు ప్రసవ వేదన రావడంతో భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి ఆదిలాబాద్ ఆసుపత్రికి వెళ్లారు. ఈ సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. 27వ తేదిన తెల్లవారుజామున అతని కుమారుడు ఇంటికి చేరుకోగా చోరీ విషయం బయటపడింది. బాధితుడి వివరాల ప్రకారం.. ఇంట్లోని బీరువా తెరిచి బంగారం, వెండి ఆభరణాలు, నగదు దొంగిలించారు. దొంగిలించబడిన వాటిలో సుమారు 1 తులం కమ్మలు, 2 తులాల నల్లపూసల హారం, 9 గ్రాముల చైన్, మరో రెండు జతల కమ్మలు, 11.5 తులాల వెండి పట్టీలు, రూ.10వేల నగదుతో పాటు ఇతర ఆభరణాలు ఉన్నాయి. వారం రోజుల్లోనే రెండు చోరీలు జరగడంతో మండలవాసులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టి నిందితులను త్వరగా పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం

**ఉద్యమ కెరటం, తాంసి:** శ్రీరామ నవమి సందర్భంగా తాంసి మండలం కప్పర్ల గ్రామంలోని రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీతారాముల కల్యాణ మహోత్సవం మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయం కొనియాడారు. భక్తులకు మరింత సౌకర్యాలు కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

- భక్తు లతో కిటకిటలాడిన రామాలయాలు

**ఉద్యమ కెరటం, హత్నూర:** హత్నూర మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని రామాలయాలు భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించగా, వేద మంత్రోచ్చరణాల మధ్య సీతాసమేత శ్రీరామచంద్ర స్వామి వారి కళ్యాణం కన్నులపండుగగా జరిగింది. వేడుకల సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కలిసి ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం శ్రీరాముడి విగ్రహాలను పూలతో అలంకరించి పల్లకిలో గ్రామ వీధుల గుండా ఊరేగించారు. జై శ్రీరామ్ నినాదాలతో ఊరంతా మార్మోగించారు. కోలాటాలు, భజనలు, కీర్తనలు, రామాయణ పారాయణాలతో ఆధ్యాత్మిక భావంలో మునిగిపోయారు.



